క్లుప్తంగా

ఘనంగా ధనుర్మాస పూజలు



వివిధ రకాలపూల అలంకరణలో వేణుగోపాలస్వామి

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో ధనుర్మాసఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గోవింద మాలాధారణ చేసిన భక్తులు నగరసంకీర్తనలు, మేల్కొల్పులు, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా చేశారు. వేకువజామునలేచిన భక్తులు సువర్ణముఖినదిలో స్నానాలు, పూజలు చేసి అనంతరం వేణుగోపాలస్వామి, వీర వెంకట సత్యనారాయణ, రాముల వారి ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో శతాబ్దాలకాలం నాటి వేణుగోపాల స్వామి వారికి భక్తులు పూజల నిమిత్తం 5 రకాల చామంతి, బంతి, కాగడాలు, గులాబీ తదితర పూలతో అలంకరణ చేశారు.

రెండు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



జోగింపేటలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన లచ్చయ్యపేట, జోగింపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్యపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమీపిస్తున్నందున సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుద్దీకరణ పనులు తాగునీరు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సీహెచ్ కృష్ణ, కె సింహాచలం, ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మకు ప్రత్యేక పూజలు



ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చదురు గుడిలో ఉన్న అమ్మవారి ఘటాలకు భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి పోలమాంబ అమ్మవారిని చదురు గుడికి తీసుకురాగా, మంగళవారం కాళ్లు నొప్పులు కారణంగా అమ్మవారు చదురు గుడిలో కొలువై ఉన్నారు. పలు గ్రామాలు నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు. బుధవారం నుంచి అమ్మవారి ఘటాలను గ్రామంలో తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తారు.

ప్రజల ఆరోగ్యభద్రతే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు



డాక్టర్‌తో మాట్లాడుతున్న డీఎంఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు

సీతానగరం: ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడానికి క్షేత్రస్థాయిలో రోగుల ఇళ్లవద్దనే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించడానికి ప్రత్యేకించి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నట్లు డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జానుమల్లువలసలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్)2 కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి రోగులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభుతేజ, స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ స్వరూప్, డాక్టర్ పవన్, ఈఓపీఆర్డీ కె.కుమార్ వర్మ, సర్పంచ్ వై వెంకటనాయుడు, ఎంపీఈఓ జి సూర్యనారాయణ, హెల్త్ సూపరువైజర్లు, వైద్యసిబ్బంది, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో పింఛన్ కానుకల పంపిణీ

సీతానగరం: మండలంలో కొత్తవారితోపాటు పాతవారికి పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుకలు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, గ్రామ వలంటీర్ల ఆధ్వర్యంలో మంగళవారం ఊరూరా పంపిణీ చేశారు. పింఛన్ కానుక రూ 3 వేలు వంతున పంపిణీ చేయడంతో జగనన్న ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసిందని లబ్ధిదారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయానికే పింఛన్ దారుల ఇళ్లకు వెళ్లి ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు పంపిణీ చేశారు.



అప్పయ్యపేటలో ఎంపీటీసీ కుసుమ కుమారి, సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం



చిన్నారాయుడుపేటలో పింఛన్ ఇస్తున్న సర్పంచ్ సాంబన్నదొర



తామరఖండిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ వై గౌరీశ్వరి



పెదభోగిలిలో పింఛన్ అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కూర్మారావు.సచివాలయ కన్వీనర్ కిరణ్‌కుమార్



గెడ్డలుప్పిలో పంపిణీ చేస్తున్న సర్పంచ్ తిరుపతిరావు, ఎంపీటీసీ సత్యన్నారాయణ



కేఎస్ పురంలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ యు.విజయలక్ష్మి

కోట్లాది మందికి వెలుగుబాట



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- ప్రజాసంకల్పయాత్రకు ఐదేళ్లయిన సందర్భంగా వేడుకలు

పార్వతీపురంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు విపక్ష నేతగా నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఎన్నో కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురింపజేసి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయన భారీగా వేడుక చేశారు. కేక్ కట్‌చేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ ఒక శక్తి అన్నారు. ప్రజల కోసం ఆయన రాష్ట్రంలో ఏకంగా 3,648 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయడం ఒక రికార్డు అని అయితే రాష్ట్ర ప్రగతిని అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాన్ని సరికొత్తగా ఆ పాదయాత్రే మార్చిందని చెప్పారు. పేదల బతుకులు వారి వెతలను పాదయాత్రలో దగ్గరగా చూసినందువల్లనే నవరత్నాలు, మరెన్నో సంక్షేమ పథకాలు వాలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు సీఎం జగన్ నాంది పలికారని గుర్తుచేశారు. అనంతరం రైతు బజార్ ఎదురుగా ఉన్న నిరాశ్రయులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మూడు మండలాల అధ్యక్షులు, పురపాలక సంఘం చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాల అధ్యక్షులు, స్టేట్‌కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఏఎంసీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, డైరెక్టర్లు వివిధ వార్డుల కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యసేవలు

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారని ప్రజల చెంతకే వైద్యసేవలు చేరువ చేశారని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సారిక సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష 2 కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వస్తున్న రోగులు వారికి అందిస్తున్న చికిత్స, ఏర్పాట్లు తదితర అంశాలపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ కార్డులు అర్హులకు అందజేశారు. ఎంపీడీఓ పార్వతి, నాయకులు గొర్లె రాజారావు, పాస్టర్ సువార్తరావు, పరిమళ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న పార్టీ నాయకులు

ఆడుదాం.. ఆంధ్రా పోటీలు విజయవంతం చేయాలి



ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీల టీ షర్టులు, టోపీలను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో భాగంగా బుధవారం నుంచి జరిగే మండల స్థాయి పోటీలకు పక్కాగా ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రిని పట్టణంలో ఆయన స్వగృహంలో ఎంపీడీఓ పార్వతి, మున్సిపల్ కమిషనర్ జయరాం ఆధ్వర్యంలో పీడీ, పీఈటీలు కలిశారు. క్రీడాకారులకు ప్రభుత్వం అందించిన టీషర్టు, టోపీలు, మండల స్థాయి పోటీలకు అంపైర్‌లుగా వ్యవహరించే పీడీ, పీఈటీలకు ప్రత్యేకంగా రూపొందించిన టీ షర్టులను ఆయన ఆవిష్కరించారు. పోటీలను ప్రతిభకు పట్టం కట్టేలా, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిన 50 టీడీపీ కుటుంబాలు



టీడీపీ నాయకులకు కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమం, నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పట్టణంలోని మణికంఠ కాలనీకి చెందిన 50 టీడీపీ కుటుంబాల వారికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు కండువాలు వేసి సాదరంగా వారిని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా టీడీపీలో ఉంటూ వైఎస్సార్‌సీపీలోకి రావడం, పార్టీకి పెద్ద ఎత్తున మద్దతు తెలపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్ మజ్జి పారినాయుడు, కోఆప్షన్ సభ్యులు మేరువ వెంకట్రావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ బి.గురురాజు, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి



ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ జి.వి.కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. ఎల్విన్‌పేట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిషేధిత పదార్థాల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. కురుపాం, నీలకంఠాపురం, ఎల్విన్‌పేట ఎస్సైలకు పలు సూచనలు చేశారు. పాలకొండ డివిజన్‌లోని బత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో 2 చెక్ పోస్టులు, ఎల్విన్‌పేటలో 1, కురుపాం పోలీస్ స్టేషన్ పరిధిలో మూలిగూడ జంక్షన్ వద్ద ఒక చెక్ పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సారా, గంజాయి, నగదు వంటివి అక్రమంగా తరలించకుండా 24 గంటలు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు జూదాలు, అసాంఘిక కార్యక్రమాల జోలికి పోకుండా పండగ జరుపుకోవాలని సూచించారు.

పేదల పెన్నిధి సీఎం జగన్

మక్కువ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల పాలిట పెన్నిధి అని డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర అన్నారు. మండల కేంద్రం మక్కువ హరిజన వీధి, ఆర్‌సీఎం వీధి, గొడగల వీధి, నక్కల వీధులలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర నిర్వహించారు. ఆయా వీధుల్లో ఆయన ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏమేరకు అందుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పథకాలందని లబ్ధిదారులను గుర్తించి, పథకాలన్నీ అందేలా చర్యలు తీసుకుంటామని అర్హులైన లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను అందించారు. ఆయా వీధులలో పర్యటించిన డిప్యూటీ సీఎం రాజన్నదొరకు మహిళలు ఘన స్వాగతం పలికారు. పేద ప్రజల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యమన్నారు. రాష్ట్రం బాగుండాలంటే మరోమారు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్ మావుడి రంగునాయుడు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

జన్ భాగీధారిని విజయవంతం చేయాలి

పార్వతీపురం: జన్ భాగీధారి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 19న విజయవాడలో 125 అడుగుల ఎత్తు గల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని, ఇందులో భాగంగా జన్ భాగీధారి కార్యక్రమంను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 11వరకు గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేయడం, వివరాలు తెలియజేయడం ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో సామాజిక న్యాయం, అంబేడ్కర్ గొప్పదనం గురించి తెలియజేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో ఈనెల 19వరకు కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

రేషన్ సరుకుల పంపిణీలో తాత్సారం వద్దు

- జేసీ గోవిందరావు

బలిజిపేట: రేషన్ సరుకుల పంపిణీలో తాత్సారం ఎందుకు చేస్తున్నారని ఎండీఎం ఆపరేటర్లను జేసీ గోవిందరావు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన బలిజిపేట మండలంలోని పెదపెంకి, అంపావల్లిలో సరుకుల పంపిణీని ఆకస్మికంగా పర్యవేక్షించారు. చాలా తక్కువ శాతం పంపిణీ జరిగిందని ఈ విధంగా చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. త్వరగా పూర్తిచేయడం వల్ల మీకేమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. రోజుకు 200కార్డులే అవుతున్నాయని వాహనదారులు తెలపగా అంతకంటే ఎక్కువ కార్డులకు ఇవ్వవచ్చని జేసీ గోవిందరావు వారికి వివరించారు. ఎంతత్వరగా పని పూర్తిచేసుకుంటే మీకు అంతసులువవుతుందని హితవు పలికారు. ఏదిఏమైనా సరుకుల పంపిణీలో తాత్సారం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. చాలా తక్కువ శాతం పంపిణీ జరిగిందని త్వరగా పంపిణీ పూర్తిచేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



అంపావల్లిలో ఎండీఎం సరుకుల పంపిణీ వాహనాన్ని పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

లాఖ్‌పతి డీడీ పథకంపై అవగాహన

బలిజిపేట: కేంద్ర ప్రభుత్వం మహిళల జీవనోపాధి మెరుగుపరిచేందుకు కొత్తగా ప్రవేశపెట్టిన లాఖ్‌పతి డీడీ పథకంపై మహిళా సంఘాలకు టీఓటీ సురేష్ మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ మేరకు బలిజిపేట మండల సమాఖ్య కేంద్రం వద్ద మహిళా సంఘాల వీఓఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు, మహిళలు వారి జీవనోపాధులను మెరుగుపరుచుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంద్వారా మరింత ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఈ పథకం కింద గ్రూప్ సభ్యులు అందరూ లేదా వ్యక్తిగతంగా కాని ప్రయోజనం పొందవచ్చన్నారు. సంవత్సరానికి లక్ష రూపాయల వరకు లబ్ధి చేకూరే విధంగా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చని సూచించారు. ప్రస్తుతం నడుస్తున్న గ్రూపులలో మంచి జీవనోపాధి పొందుతున్న మహిళలు దీనిద్వారా వారి జీవనోపాధి మరింత మెరుగుపరుచుకోవచ్చన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న టీఓటీ సురేష్

ప్రజాసంకల్ప యాత్రే .. నవరత్నాలకు నాంది

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాల సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజాసంకల్పయాత్రే నాంది పలికిందని ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పట్టణం, మండలంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో వైఎస్సార్ విగ్రహం వద్ద, మండలంలో బాగువలస, మామిడిపల్లి తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీజగన్‌మోహన్ రెడ్డిను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. మండలంలో పాలమడవలస,దుక్కడవలస గ్రామాల్లో పలువురు మహిళలకు చీరలను జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీజిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ తదితరులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com